సాక్షి సిద్దిపేట

శనివారం । 22 । ఏప్రిల్ । 2023

ఈద్ ముబారక్



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అల్లాదయతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్ ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు.



కుక్కలకు కు.ని.ఆపరేషన్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):వీధికుక్కలకు కుంటుబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించి మాట్లాడారు.

వ్యవసాయ మార్కెట్‌కు సెలవు



హుస్నాబాద్: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 22, 23 (శని, ఆదివారం) రెండు రోజులు సెలవు ఉంటుందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. సోమవారం మార్కెట్ తిరిగి ప్రారంభిస్తామని ఆమె వివరించారు.

న్యూస్‌రీల్

ఉద్యాన పంటల్లో సమస్యలు పరిష్కరిస్తాం



కరపత్రాలు, పుస్తకం ఆవిష్కరిస్తున్న వీసీ నీరజాప్రభాకర్ తదితరులు

ములుగు(గజ్వేల్): ఉద్యాన పంటల సాగులో సమస్యలు గుర్తించి పరిష్కరిస్తామని ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ బి. నీరజాప్రభాకర్ అన్నారు. శుక్రవారం వర్సిటీ పరిపాలన భవనంలో ఉద్యాన పరిశోధన, విస్తరణ సలహాసంఘ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యాన పంటలసాగుతో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. పసుపు, మిరప, మామిడి, బత్తాయి సాగు, ఉత్పత్తుల్లో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. రైతులు కూరగాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలన్నారు. అనుకూల సమయాల్లో సాగుచేసే కూరగాయలపై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. వరి, పత్తికి ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్‌పామ్ సాగు, అందులో అంతర పంటగా కూరగాయల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఉద్యాన సహాయ సంచాలకులు వి.బాబు మాట్లాడుతూ ముదురు మామిడి తోటలో కొమ్మ కత్తిరింపులపై నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. సమావేశంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ భగవాన్ వర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ కిరణ్ కుమార్, జోనల్‌హెడ్ డాక్టర్ సురేశ్ కుమార్ వివిధ అంశాలు వివరించారు.

సేవా కార్యక్రమాలతో ముందుకు

అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సోమ వనజ



మాట్లాడుతున్న అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సోమ వనజ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతీ ఒక్కరు సేవా కార్యక్రమాలతో ముందుకెళ్లాలని అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సోమవనజ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అలయన్స్ క్లబ్ సమావేశంలో ఆమె మాట్లాడారు. క్లబ్ ఆధ్వర్యంలో పుస్తెమట్టెల పంపిణీ, సాముహిక సీమంతాలు, వివాహాలు, పుస్తకాలు, క్రీడా వస్తువుల పంపిణీ, యువతులకు ఉచిత ఆరోగ్య శిబిరాలు, వృద్ధులకు పెన్సిల్లు, బియ్యం, కుట్టు మిషన్ల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలయన్స్ క్లబ్ జిల్లా నూతన కార్యవర్గం ఆదివారం జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అలయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు తిరుపతిరాజు, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ శాస్త్రి తదితరులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శివకుమార్, ఆత్మారాములు, అంతయ్య, రాజేశ్వర్‌రెడ్డి, అంజయ్య, రాజమల్లయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌తో సోదరభావం పెంపు



మిరుదొడ్డిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్

మిరుదొడ్డి(దుబ్బాక): ఇఫ్తార్ సోదర భావం పెంచుతోందని ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. మిరుదొడ్డిలో శుక్రవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ ఇఫ్తార్ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రార్థనలు చేశారు. తెలంగాణలో ప్రతీ పండుగ సంస్కృతీ సంప్రదాయాలకు నిలయంగా నిలుస్తాయన్నారు. రమజాన్ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, మెదక్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య, బీఆర్‌ఎస్ నాయకులు సత్తయ్య, వెంకట్, ముస్లిం అసోషియేషన్ మండల అధ్యక్షుడు ఎండీ జాకీర్ హుస్సేన్, మౌలానా, హుస్సేన్, ఖాధర్, రహీం, జానీ, మునీరొద్దీన్, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట సిగలో మరోనగ

- సాంస్కృతిక సౌరభం.. పర్యాటక వైభవం
- శిల్పారామం ఏర్పాటుకు చర్యలు ప్రారంభం
- రూ.25 కోట్లతో భారీ ప్రాజెక్టు
- 1500 మంది వీక్షించేలా వేదిక నిర్మాణం
- నేడు హరీశ్‌రావుచే శంకుస్థాపన



కోమటిచెరువు ప్రాంతంలో నిర్మించనున్న శిల్పారామం ఊహాచిత్రం



సిద్దిపేటజోన్: సిద్దిపేట సిగలో మరోనగ ధగధగలాడనుంది.కోటి అందాల కోమటి చెరువు చెంత శిల్పారామం చేరనుంది. మహానగరాలకే పరిమితమైన సాంస్కృతిక వేదిక మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో పట్టణ ప్రజల ముంగిట్లోకి రానుంది. సుమారు రూ. 25 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న శిల్పారామం కోసం శనివారం ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు భూమి పూజ చేయనున్నారు. ఇప్పటికే పర్యాటక కేంద్రంగా రాష్ట్రానికి రోల్ మోడల్‌గా నిలిచిన కోమటిచెరువు మినీట్యాంక్ బండ్‌కు కొత్త అందాలు సంతరించుకోనున్నాయి. సుమారు 1500 మంది వీక్షించేలా శిల్పకళావేదికను ఏర్పాటు చేయనున్నారు.

స్పెషల్ అట్రాక్షన్..



సిద్దిపేట కోమటి చెరువు అందాలు అంతర్జాతీయంగా అందరికీ తెలుసు. ప్రవాసభారతీయులు ఇక్కడివచ్చి చెరువు అందాలు వీక్షిస్తున్నారు. ఇప్పుడు నిర్మించనున్న శిల్పారామం స్పెషల్ అట్రాక్షన్ గా నిలవనుంది. పర్యాటక, సాంస్కృతిక వేదికగా కోమటి చెరువు విరాజిల్లనుంది.

– హరీశ్‌రావు, ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి

మహానగరాలకు దీటుగా..

హైదరాబాద్, తిరుపతి, విజయవాడలోని శిల్పారామాలకు దీటుగా సరికొత్త హంగులు, పల్లె సంస్కతీసంప్రదాయాలు ఉట్టిపడేలా సిద్దిపేటలో శిల్పారామం నిర్మించనున్నారు. కోమటిచెరువు శివారులోని నెక్లెస్, బైపాస్ రోడ్డు మధ్యలో ఆరు నుంచి 15 ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేయనున్నారు. పల్లెల్లోని చేతివృత్తులు, హస్త కళా నైపుణ్యాలు తీర్చిదిద్దేలా మ్యాప్ రూపొందించారు.

- కోమటిచెరువు ప్రాంతంలో ఇప్పటికే నెక్లెస్ రోడ్డు, గ్లోగార్డెన్, అడ్వెంచర్ పార్క్, సింథటిక్ ట్రాక్ లు ఎంతో ఆకర్షణగా నిలుస్తున్నాయి.
- వాటర్ ఫౌంటెన్, ఫుడ్ కోర్ట్, రాక్ గార్డెన్, చిల్డ్రన్ ప్లేఏరియా, డెక్, స్విమ్మింగ్ పూల్, బంపర్ కార్స్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ కోర్ట్, ఆర్టిఫిషియల్ బీచ్, స్టాల్స్, ఆక్వేరియం, కాటేజెస్ లాంటి 21 రకాల సౌకర్యాలు ఉన్నాయి. ఇప్పుడు శిల్పారామం అందుబాటులోకి రానుంది.
- కోమటిచెరువు చుట్టూ నెక్లెస్ రోడ్డు పూర్తిచేసి దానిపక్కన ఆర్టిఫిషియల్ బీచ్ నిర్మించనున్నారు. దీంతో సముద్రం ఒడ్డున జల ఆనందం పొందే వసతి సిద్దిపేట ప్రజల ముంగిట్లోకి రానుంది.
- ఇప్పటికే ఓపెన్ ఆడిటోరియం, విపంచి ఆడిటోరియం సేవలు సిద్దిపేట లో ఉన్నప్పటికీ కోమటిచెరువు ఒడ్డున, సాయం సంధ్య వేళల్లో సాంస్కతిక కార్యక్రమాలను 1500 మంది కూర్చొని వీక్షించేందుకు అనువుగా శిల్పకళావేదికను నిర్మించనున్నారు.
- శిల్పారామంలో పల్లె వాతావరణం కొట్టొచ్చేలా పురాతన కళలు, సంప్రదాయాలు పొందుపర్చనున్నారు. క్రాఫ్ట్ మ్యూజియం, కల్చరల్ మ్యూజియం, ఆర్ట్ గ్యాలరీ, లైబ్రరీ, ఆడిటోరియం, డిజైన్ సెంటర్, వర్క్ షాప్, లాంటివి ఏర్పాటు చేయనున్నారు.
- దేశవ్యాప్తంగా ఉన్న ఆయా ప్రాంతాల్లో సంస్కతీసంప్రదాయాలు ప్రతిబింబించే చేతి వృత్తుల నైపుణ్యాం ప్రదర్శించడం.. వాటిని విక్రయించేలా ప్రత్యేక ఆడిటోరియం ఏర్పాటు చేయనున్నారు. హస్త కళా ఉత్పత్తులు, మెటల్, ఉడ్‌తో తయారీ చేసినవి, సంప్రదాయ ఆభరణాలు ప్రదర్శన చేసేలా సౌకర్యాలు కల్పించనున్నారు.

బూస్టర్ డోస్ రెడీ



- జిల్లాకు చేరిన టీకాలు
- నేటి నుంచి వ్యాక్సినేషన్

సాక్షి, సిద్దిపేట : దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతుండటంతో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. జిల్లాకు 8 వేల డోసుల బూస్టర్ డోస్ సరఫరా చేసింది. శనివారం నుంచి వ్యాక్సినేషన్ కోసం ఏర్పాట్లు చేశారు.

35 పీహెచ్‌సీల్లో...

జిల్లా వ్యాప్తంగా 35 పీహెచ్‌సీలు, వైద్యావిధాన పరిషత్ ఆస్పత్రులు 5, రెండు అర్బన్ హెల్త్ సెంటర్‌లలో కొవిడ్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచారు. మొదటి రెండో డోసులు కొవాగ్జిన్ లేదా కొవిషీల్డ్ టీకాలు వేయించుకున్న వారు బూస్టర్ డోస్‌గా కార్బేవ్యాక్స్‌ను తీసుకోవచ్చని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

- ఆధార్ కార్డుతో సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైద్యా విధాన పరిషత్, జిల్లా ఆస్పత్రుల్లో ఎక్కడైనా బూస్టర్ డోస్ వేసుకునే అవకాశం ఉంది.
- జిల్లాలో ఈనెల 22 కరోనా పాజిటీవ్ కేసులు నమోదుకాగా, అందరూ హోం అసోలేషన్‌లో ఉన్నారు.

అందరూ తీసుకోవాలి...

- కాశీనాథ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి

అర్హులైన ప్రతీ ఒక్కరు బూస్టర్ డోస్ తీసుకోవాలి. రద్దీ ప్రాంతాల్లో తిరిగినప్పుడు మాస్క్ తప్పకుండా ధరించాలి. ప్రతీ ఒక్కరు వ్యాక్సిన్ వేసుకోవాలి.

బ్రోకర్లను నమ్మొద్దు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీజీపీ అంజనీకుమార్

- గుర్తింపు పొందిన ఏజెంట్ల ద్వారానే విదేశాలకు వెళ్లాలి
- డీజీపీ అంజనీకుమార్

సిద్దిపేటకమాన్: తెలంగాణ ఓవర్సీస్ మైగ్రేన్ కంపెనీ ద్వారా గుర్తింపు పొందిన ఏజెంట్ల ద్వారానే విదేశాలకు వెళ్లాలని డీజీపీ అంజనీకుమార్ సూచించారు. శుక్రవారం హైదరాబాద్ రీజినల్ పాస్‌ఫోర్ట్ అధికారి బాలయ్య, కేంద్ర సీఓఎంబీ సెక్రటరీలతో కలిసి జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బ్రోకర్లను నమ్మొద్దని, ఫేక్ పాస్‌ఫోర్ట్, ఫేక్ వీసాతో ఎవరు కూడా విదేశాలకు వెళ్లొద్దన్నారు. ఐటీ సెక్టర్‌లో వెళ్లే విద్యార్థులు కూడా పాస్‌పోర్ట్, వీసాపై అన్నిజాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎస్‌బీ ఫీల్డ్ అధికారులు పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ చేసేటప్పుడు వాళ్లు ఎక్కడికి వెళుతున్నారు? ప్రభుత్వ ఆమోదం పొందిన ఏజెంట్ల ద్వారా వెళుతున్నారా? గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. నకిలీ ఏజెంట్లు విదేశాలకు పంపిస్తామని మోసం చేస్తే ఇమిగ్రేషన్ 1983 యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీ శ్వేత, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్, ఎస్‌బీ ఏసీపీ రవీందర్‌రాజు, ఎస్‌బీ సీఐ రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 'స్నేహిత' భరోసా

మహిళలకు స్నేహిత సెంటర్ భరోసాగా నిలుస్తోందని సిద్దిపేట సీపీ శ్వేత తెలిపారు. శుక్రవారం సెంటర్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పోక్సో, అత్యాచార కేసులు నమోదైన వెంటనే బాధితులను నేరుగా భరోసా సెంటర్‌కు తరలించి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. భరోసా సెంటర్ నుంచి 9 మంది బాధితులకు ఆర్థిక సాయం అందజేసినట్లు సీపీ వెల్లడించారు. బాధితుల్లో ఆర్థిక పరిస్థితి సరిగాలేని ఆరుగురికి కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీపై శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్‌కు 315 దరఖాస్తులు రాగా 255 మంది కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. గృహహింస, వరకట్న వేధింపులకు గురి చేస్తే స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ **9494639498** నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్, మహిళా స్టేషన్ సీఐ దుర్గ, భరోసా సెంటర్ సిబ్బంది అనూష, వినోద, సౌమ్య, హరిత, రేణుక, భవాని, నవనీత, కో ఆర్డినేటర్ సుజాత, కౌన్సిలర్ వసంత, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి హుస్నాబాద్ హైస్కూల్ వజ్రోత్సవాలు

విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి రాక



మంత్రి పాల్గొనే సభావేదిక వద్ద కమిటీ సభ్యులు

హుస్నాబాద్: హుస్నాబాద్ గవర్నమెంట్ హైస్కూల్ వజ్రోత్సవాలకు సిద్ధమైంది. ఈమేరకు కార్యక్రమాల నిర్వహణకోసం శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. వేడుకల నిర్వహణ కమిటీ కన్వీనర్ కొండా లక్ష్మణ్ అధ్యక్షతన సభ్యులు, టీచర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఈనెల 23న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరిస్తారని తెలిపారు. తీపి జ్ఞాపకాలకు గుర్తుగా నిర్వహించే ఉత్సవాలకు పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. అనంతరం బైక్ ర్యాలీ స్టిక్కర్లు ఆవిష్కరించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొనే సభావేదిక స్థలాన్ని పరిశీలించారు. సమావేశంలో వజ్రోత్సవ కమిటీ బాధ్యులు పందిల్ల శంకర్, కేడం లింగమూర్తి, ఒంటెల రత్నాకర్, కొత్తపల్లి అశోక్, గడిపె మల్లేశ్, అయిత శ్రీధర్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, వల్లపు రాజు, అయిలేని శ్రీనివాస్ రెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బండారి మనీల, ఎస్.వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సిద్దిపేట గానప్రియ

- ఇండియన్ ఐడల్‌లో లాస్య
- ట్విట్టర్‌లో మంత్రి హరీశ్ ప్రశంస



సిద్దిపేటజోన్: సిద్దిపేటకు చెందిన గుమ్మన్నగారి లక్ష్మీనర్సింహాశర్మ పేరు తెలియనివారు ఉండరు. సీఎం కేసీఆర్‌కు గురువు కూడా ఈయనే. ఆయన ఇంట పుష్పించిన సంగీత సౌరభమే లాస్యప్రియ. ఈమె ఓ ప్రైవేట్ చానల్‌లో ఇండియన్ ఐడల్ సీజన్–2 వ్యక్తిగత పాటల విభాగంలో అద్భుత ప్రతిభ కనబరుస్తోంది. సిద్దిపేటకు గుమ్మన్నగారి లక్ష్మీనర్సింహాశర్మ కొడుకు గుమ్మన్నగారి వేణుమాధవ్ శర్మ, చంద్రికల కుమార్తె లాస్యప్రియ ప్రాథమిక విద్యాభ్యాసం అంతా స్థానికంగానే సాగింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తోంది. చిన్నప్పటి నుంచి సంగీతంపట్ల ఆసక్తి పెంచుకున్న లాస్య..ఓవైపు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే తీరిక సమయాల్లో ఆయా టీవీ ఛానళ్లు నిర్వహించే పాటల పోటీలకు హాజరయ్యేది. ఓ ఛానల్ నిర్వహించిన బోల్ బేబీ బోల్ లో ప్రతిభ కనబర్చింది. కొన్ని చిత్రాల్లో డబ్బింగ్ కూడా చేసింది. ఇండియన్ ఐడల్ సీజన్–2 ఆడిషన్‌లో 10వేల మంది పాల్గొనగా తెలంగాణ రాష్ట్రం నుంచి లాస్య ఎంపిక కావడం విశేషం.

మంత్రి అభినందన..

ఇండియన్ ఐడల్ సీజన్–2లో పాటల ద్వారా అందరినీ మెప్పిస్తున్న లాస్యప్రియను మంత్రి హరీశ్‌రావు అభినందించారు. సంగీత ప్రస్థానాం కొనసాగించాలని ట్విట్టర్ ద్వారా ప్రశంసించారు.

ఐటీ టవర్ రెడీ కావాలి



ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

సిద్దిపేటఅర్బన్: వచ్చేనెల రెండో వారంలోగా ఐటీ టవర్ ప్రారంభానికి సిద్ధం కావాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటి ఆదేశించారు. సిద్దిపేట కలెక్టరేట్ సమీపంలో నిర్మిస్తున్న ఐటీ టవర్ పనులను శుక్రవారం అయన పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మిట్టపల్లి–ఎల్లుపల్లి శివారులో జిల్లా మహిళా సమాఖ్య, వృద్ధాశ్రమం, మహిళా ప్రాంగణం పనులు పరిశీలించారు. టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు భవన నిర్మాణ పనులు మ్యాప్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ సుదర్శన్‌రెడ్డి, అధికారులు, డీడబ్ల్యూవో రాంగోపాల్, తదితరులు ఉన్నారు.

నాణ్యతాప్రమాణాలు పాటించాలి

సిద్దిపేటకమాన్: ఆస్పత్రి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనుల్లో క్వాలిటీ పాటించాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆదేశించారు. ఎన్సాన్‌పల్లి శివారులో నిర్మిస్తున్న 1000 పడకల ఆస్పత్రి పనులను మెడికల్ కాలేజీ డైరెక్టర్ విమలాథామస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణం చేపట్టాలన్నారు. వాహనాల పార్కింగ్ కోసం స్థలం ఉండేలా చూసుకోవాలన్నారు. రోడ్లు, విద్యుత్తు, సివిల్ పనులు పూర్తిచేయాలన్నారు. మార్చురీ భవనం, నర్సుల క్వార్టర్స్, సెంట్రల్ డ్రగ్ స్టోర్, 50 పడకల ఆయుష్ ఆస్పత్రి భవనాల పనులు వివరాలు తెలుసుకున్నారు. త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.

ప్రభుత్వంపై విమర్శలు తిప్పికొట్టాలి

- నిజాలు నిత్యం ప్రచారంలో ఉండాలి
- సంక్షేమంలో తెలంగాణది ప్రత్యేక ముద్ర
- మంత్రి హరీశ్‌రావు



అంబేడ్కర్ ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: తెలంగాణ ప్రభుత్వంపై ప్రతిపక్షపార్టీలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని, నిజాలు ప్రచారంలో ఉండేలా చూడాలని మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్ మండలం ధర్మారెడ్డి పల్లిలోని శోభ గార్డెన్స్‌లో నిర్వహించిన మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. ప్రజ్ఞాపూర్‌లో బీసీ కమ్యూనిటీ భవనం, ముట్రాజ్ పల్లిలో టీఎస్‌జీవో భవనం, గజ్వేల్ మినీస్టేడియం సమీపంలో అంబేడ్కర్ ఫంక్షన్‌హాల్, మార్కెట్ యార్డులో భూసార పరీక్షా కేంద్రం, పట్టణంలో బస్తీ దవాఖాన, బటర్‌ఫ్లై లైట్లకు ప్రారంభించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ, స్థానిక మదీన మజీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. త్వరలో ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ (క్యాష్‌లెస్ హెల్త్ సర్వీసెస్) పథకాన్ని అమలు చేస్తామన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టిసారించాలన్నారు. ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 200 మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణకే దక్కిందన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, టీఎస్ఎంఐడీసీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జడ్పీ చైర్మన్ రోజాశర్మ, 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, ఆర్డీవో విజయేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ మల్లేశం, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీరవీందర్, బీఆర్ఎస్ గజ్వేల్ మండలశాఖ అధ్యక్షుడు బెండ మధు, పట్టణశాఖ అధ్యక్షుడు నవాజ్‌మీర పాల్గొన్నారు.



గజ్వేల్‌లో నిర్వహించిన ఇఫ్తార్‌లో ఖర్జూరం తినిపిస్తున్న మంత్రి హరీశ్‌రావు

క్లుప్తంగా

భర్తతో గొడవపడి భార్య అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: భర్తతో గొడవపడి భార్య అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కిష్టారెడ్డి చెప్పిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడలో నివాసం ఉంటున్న బస్వరాజ్ భార్య శశికళ ఇద్దరు గొడవపడ్డారు. దీంతో ఆమె గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి అదృశ్యంపై కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బిట్ కాయిన్ కోసం ఆరా మోసపోయిన మహిళ

రూ.1,20,000లు పోగొట్టుకున్న బాధితురాలు

సిద్దిపేటకమాన్: బిట్ కాయిన్ కోసం ఓ మహిళ ఆన్‌లైన్‌లో సైబర్ మోసానికి గురైన సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట సీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన ఓ మహిళ గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి బిట్ కాయిన్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేసింది. అందులో ఉన్న ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసింది. గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన మాయమాటల్లో పడి బాధితురాలు ఆన్‌లైన్‌లో రూ.1,20,000లు పంపించింది. అనంతరం ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో సైబర్ మోసం జరిగినట్లు గుర్తించింది. వెంటనే బాధితురాలు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేసింది.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్: మండలంలోని మాడ్గి గ్రామానికి చెందిన రాంచందర్(55) కుటుంబ కలహాలతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..గురువారం రాత్రి 10.30కు రాంచందర్ భార్యతో గొడవపడ్డాడు. అనంతరం జీవితంపై విరక్తి చెంది చున్నీతో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కిందకు దింపారు. గ్రామస్తుల సహాయంతో జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుడు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపాడు. కుమారుడు జీవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పూరిగుడిసె దగ్ధం

నర్సాపూర్ రూరల్: మండలంలోని తుజాల్‌పూర్‌లో పూరి గుడిసె దగ్ధమైంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పన్యాల శేఖర్ తన భార్య పిల్లలతో పూరిగుడిసెలో నివాసం ఉంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు పూరి గుడిసెకు నిప్పు అంటుకుంది. ఈ ప్రమాదంలో గుడిసెలోని నిత్యావసర సరుకులతో పాటు, వంట సామగ్రి, బట్టలు, రూ.8,500లు కాలి బూడిదయ్యాయి. ఇంటికి నిప్పు అంటుకున్న సమయంలో శేఖర్‌తో పాటు అతని భార్య పద్మ పిల్లలు సాధిక, సుప్రియ, సుశాంత్, చరణ్ నిద్రలో ఉన్నారు. శేఖర్, పద్మలు అప్రమత్తమై వెంటనే బయటకు పరుగులు తీశారు. మంటలు ఆర్పేందుకు గ్రామస్తులు శ్రమించినప్పటికీ అప్పటికే గుడిసె పూర్తిగా కాలిపోయింది. శేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వీడని అకాల వర్షం..

- గాలి దుమారంతో వాన
- పంటలకు నష్టం
- వరిచేలల్లో రాలిన గింజలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఆందోళనలో రైతులు



దుబ్బాకలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం

దుబ్బాకటౌన్: మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లుగా తయారైంది రైతుల పరిస్థితి. సరిగ్గా వారం క్రితమే వడగండ్ల భీభత్సం. ఆ షాక్ నుంచి ఇంకా తేరుకోకముందే అకాల వర్షం. శుక్రవారం తెల్లవారుజామున గాలిదుమారంతో వాన పడడంతో పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో రైతులకు పుండు మీద కారం చల్లినట్లుగా తయారైంది వారి పరిస్థితి. గురువారం అర్ధరాత్రి నుంచే ఉరుములు..మెరుపులతో కూడిన గాలి దుమారం.

మధ్యరాత్రి 3 గంటలకు వాన పడింది. విపరీతంగా గాలిదుమారంతో వానపడడంతో కోతకొచ్చిన వరిచేలల్లో గింజలు రాలి పంటలకు నష్టం వాటిల్లింది. దుబ్బాకతో పాటు చెల్లాపూర్, మల్లాయపల్లి, బల్వంతాపూర్, పద్మశాలిగడ్డ, చీకోడ్, కమ్మరపల్లి, రాజక్కపేట, చేర్వాపూర్, లచ్చపేట ధర్మాజీపేట, రామక్కపేట గ్రామాల్లో గాలివానతో పంటలకు తీవ్ర నష్టం కలిగింది. ఇప్పటికే గత వారం రోజుల క్రితం వడగండ్ల వాన చెల్లాపూర్, మల్లాయపల్లి, బల్వంతాపూర్, పద్మశాలిగడ్డ గ్రామాలతో పాటు దుబ్బాక పట్టణంలో వరిపంటలు 90 శాతంకు పైగా నష్టం వాటిల్లింది.

కుప్పల్లో చేరిన నీరు

అకాల వర్షంతో దుబ్బాక మార్కెట్ యార్డుతో పాటు చెల్లాపూర్‌లో వరికోసి ఆరబెట్టేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద పోసిన ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాని ఆరబెట్టేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కుప్పల క్రింది నుంచి నీళ్లు పోవడంతో ధాన్యాన్ని మళ్లీ వేరేచోటుకు రైతులు ఎత్తిపోయాల్సిన పరిస్థితి దాపురించింది. కోసిన ధాన్యం అకాల వర్షంతో తడిసి ముద్దవ్వగా, వరికోతలు సాగని పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు వెంటాడుతున్న అకాల వర్షం..మరోవైపు పంట చేతికొస్తుందో రాదోనని రైతులు అయోమయం చెందుతున్నారు. గాలివానకు చెల్లాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఇండ్ల రేకులు, పశువుల షెడ్లు సైతం ధ్వంసం అయ్యాయి.



చెల్లాపూర్‌లో గాలివానకు కూలిన పశువుల కొట్టం

ఆరబెట్టిన ధాన్యం తడిసింది

రెండు రోజుల క్రిందటనే 8 ఎకరాల్లో వరిపంట కోసి మార్కెట్‌లో పోసిన. అర్ధరాత్రి తరువాత ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో గాలివాన పడడంతో మార్కెట్‌లో పోసినధాన్యం తడిసింది. ఎండబోసిన వడ్లు కూడా తడిశాయి. నా కుప్పల క్రింద నుంచి నీళ్లు పోయినయి.

–కేసుగారి స్వామి, రైతు, దుబ్బాక



పశువులపై చిరుత దాడి

లేగ దూడ మృతి



మృతి చెందిన లేగ దూడ

కల్హేర్(నారాయణఖేడ్): పశువులపై చిరుత దాడి చేసిన ఘటనలో లేగ దూడ మృతి చెందిన ఘటన రాపర్తి శివారులో జరిగింది. స్థానికులు, ఉరటి సాయిలు (రైతు) చెప్పిన వివరాల ప్రకారం..గురువారం రాత్రి మండలంలోని రాపర్తి శివారులో చిరుత పులి ప్రత్యక్షమైంది. ఉరటి సాయిలుకు చెందిన పశువులపై చిరుత పులి దాడి చేసింది. ఈ ఘటనలో లేగదూడ హతమైనట్లు ఆయన పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ శ్రావణ్‌కుమార్, అటవీ శాఖ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత కొంత కాలంగా అటవీ ప్రాంతాంలో చిరుత పులి సంచరిస్తుండడంతో కల్హేర్, సిర్గాపూర్ మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కడ్పల్ శివారులో అడవిలో కెమెరాలు ఏర్పాటు చేయడంతో అప్పట్లో చిరుత పులి తిరుగుతున్న దృశ్యాలు కెమెరాలకు చిక్కాయి. దీంతో అక్కడ చిరుత పులి ఉందనే విషయన్ని అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. కడ్పల్, ఖాజపూర్, ఖానాపూర్(కె), నాగధర్, రాపర్తి, కృష్ణాపూర్, సంజీవన్‌రావుపేట చుట్టూ అటవి ప్రదేశం ఉండడంతో చిరుత సంచరిస్తుంది. ఈ క్రమంలో స్థానికులు ఇబ్బందులు పడుతున్నామని, తమతో పాటు పశువులకు రక్షణ కల్పించాలని వారు అటవీ అధికారులను కోరుతున్నారు. నష్టపోయిన సాయిలును ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన వేడుకొంటున్నాడు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో ఒకరు, పురుగుల మందు తాగి ఇంకొకరు మృతి చెందారు.



బాల్‌రెడ్డి (ఫైల్)

దుబ్బాక: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతున్న..వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం దౌల్తాబాద్ ఎస్‌ఐ చైతన్య రెడ్డి వివరాల ప్రకారం..రాయపోల్ మండలం తిమ్మక్కపల్లికి చెందిన కర్ణంపల్లి బాల్‌రెడ్డి(45) ఈ నెల 14వ తేదీన పని నిమిత్తం దుబ్బాక నుంచి తిరిగి వెళ్తున్న క్రమంలో బైక్‌ను వేగంగా నడపడంతో దొమ్మాట గ్రామ శివారులో రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బాల్‌రెడ్డిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాల్‌రెడ్డి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు దశ్మంత్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చేర్యాల(సిద్దిపేట): పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కడవేర్గు గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆరుట్ల ప్రసాద్(33) ప్రైవేటు జాబ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొద్దిరోజులుగా మద్యానికి బానిసైన ప్రసాద్ ఈ నెల 16వ తేదీ రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చిన అనంతరం భార్య రమ్యతో గొడవపడ్డాడు. విషయం తెలుసుకొని తల్లిదండ్రులు మందలించారు. మద్యం మత్తులో ఉన్న ప్రసాద్ క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్సని మిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం నిర్వహిస్తుండగా శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అస్థికలు కలిపేందుకు వెళుతుండగా..



బస్సు క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్ పగిల్ల ఎల్లయ్య



ప్రమాద బాధితులకు చికిత్స అందిస్తున్న దృశ్యాలు

- జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదం
- డ్రైవర్ మృతి.. 25 మందికి తీవ్రగాయాలు
- 15 మంది పరిస్థితి విషమం

వెల్గటూర్, గజ్వేల్: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ప్రైవేట్ బస్సు డ్రైవర్ పగిల్ల మల్లయ్య(50) దుర్మరణం చెందగా, మరో 25మందికి తీవ్రగాయాలయ్యాయి. ఇందులో 15మంది పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బెజుగామ గ్రామానికి చెందిన ఆకుల దేవేందర్ తల్లి ఆకుల అనసూయ ఇటీవల మరణించింది. ఆమె అస్థికలు జగిత్యాల జిల్లా ధర్మపురి గోదావరి నదిలో కలపడానికి ప్రైవేట్ బస్సులో శుక్రవారం ఉదయం బయలు దేరారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన 25 మంది ఉన్నారు. బస్సు కొత్తపేట గ్రామం వద్దకు చేరింది. అక్కడ రోడ్డుపై పడిఉన్న చెట్టును తప్పించబోయింది. అదేసమయంలో రాయపట్నం నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ వేగంగా రావడంతో బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ పగిల్ల ఎల్లయ్య క్యాబిన్‌లో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఒకేకుటుంబానికి చెందిన ఆకుల మంగమ్మ, మౌనిక, శ్రీనివాస్, వెంకటేశం, యాదగిరి, నాగలక్ష్మి, విజయలక్ష్మి, దినేశ్, భాగ్యలక్ష్మి, సుభద్ర, అక్షర, మయాన్షి, మానస, కనకయ్య సహా సుమారు 25 మంది గాయపడ్డారు. 15 మంది కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు. బస్సు క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్ పగిల్ల ఎల్లయ్యను జేసీబీ సాయంతో శ్రమించి బయటకు తీశారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. గాయపడ్డ మిగతావారిని కరీంనగర్, జగిత్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన వారిలో 15మంది పరిస్థితి విషమంగా ఉంది.

చెట్టుకొమ్మను తప్పించబోయి..

వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో గురువారం రాత్రి బలమైన ఈదురుగాలలు వీచాయి. వీటిధాటికి చెట్టుకొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. సాయంత్రం వరకూ వాటిని ఎవరూ తొలగించలేదు. అయితే, ఈ చెట్టుకొమ్మలను తప్పించే ప్రయత్నంలో బస్సు డ్రైవర్ అదుపుతప్పి లారీని ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరో 15కిలోమీటర్ల దూరంలో ధర్మపురికి చేరుకునేలోపే రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటన బెజుగామ గ్రామంతో పాటు గజ్వేల్ పట్టణంలో విషాదాన్ని నింపింది.

భర్త ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): భార్య పుట్టింటి నుంచి రావడంలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చందాయిపేటలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన అవబోతు గణేశ్(30)కు అదే గ్రామానికి చెందిన సౌజన్యతో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. నాలుగు నెలల క్రితం సౌజన్యకు శస్త్ర చికిత్స చేయించగా అదే గ్రామంలోని తన పుట్టింట్లో ఉంటుంది. గణేశ్ సౌజన్యను తమ ఇంటికి రావాలని ఇటీవల భార్యతో గొడవ పడుతుండేవాడు. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోక పోవడంతో మద్యం సేవించి ఓ తోటలో ఉరి వేసుకొని మృతి చెందాడు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): నందికంది జాతీయ రహదారిపై లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరు చిన్నారులు గురువారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ ప్రమాద స్థలాన్ని శుక్రవారం సంగారెడ్డి డీఎస్పీ రవీంద్ర రెడ్డి పరిశీలించారు. ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన అండర్ పాస్ నిర్మాణాన్ని చేపట్టాలని సర్పంచ్ రాజు, ఉప సర్పంచ్ సునీల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. వేగంగా వెళ్తున్న వాహనాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తగిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ నవీన్ కుమార్, ఎల్ అండ్ టి అధికారులు పాల్గొన్నారు.

చిన్నారి రిహాన్ అంత్యక్రియలు పూర్తి

గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి రిహాన్(12) అంత్యక్రియలను శుక్రవారం నిర్వహించారు. మరో చిన్నారి సక్లయిన్(8) మృతదేహాన్ని బీహార్‌లోని వారి స్వగ్రామానికి అంబులెన్స్‌లో తరలించారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



వృద్ధుడి మృతదేహం

రామాయంపేట(మెదక్): అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని 60ఏళ్ల వృద్ధుని మృతదేహం శుక్రవారం రైల్వే పోలీసులకు లభ్యమైంది. కామారెడ్డి రైల్వే హెడ్ కానిస్టేబుల్ జశ్వంత్‌సింగ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలిని ఆయన సందర్శించారు. అక్కడ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంపై వృద్ధుడి మృతదేహాన్ని చూశారు. గుర్తు తెలియని వృద్ధుడిగా కేసు నమోదు చేసినట్టు రైల్వే కానిస్టేబుల్ జశ్వంత్‌సింగ్ తెలిపారు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని ఆయన పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి..



సత్తయ్య మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): చేపలవేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం..శుక్రవారం మండలంలోని గవ్వలపల్లి గ్రామానికి చెందిన తలారి సత్తయ్య(56) గ్రామశివారులోని చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చేపల కోసం వేసిన వల కాళ్లకు చుట్టుకొని ఈత కొట్టలేక ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. రోజూ మాదిరిగానే తెల్లవారుజామున చేపల వేటకు వెళ్లి తెల్లారేసరికి ఇంటికి వచ్చే భర్త ఎంతకూ రాకపోవడంతో అతని భార్య లక్ష్మి, అల్లుడు రవి చెరువు వద్దకు వెళ్లి చూశారు. అక్కడ చెరువులో చేపలవలకు చుట్టుకొని నీటిలో మునిగి ఉన్నట్టు కన్పించాడు. వెంటనే చెరువులోకి వెళ్లి సత్తయ్యను రక్షించేందుకు ప్రయత్నించగా అతను అప్పటికే చనిపోయినట్లు గ్రహించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

కారు ఢీ కొని లారీ డ్రైవర్..



ఒర్సు మల్లేశ్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): కారు ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్ ఒర్సు మల్లేష్(46) అక్కడిక్కడే మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకులారీ నడుపుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో డ్రైవరు టీ తాగేందుకు తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో ఓ హోటల్ వద్ద లారీనీ నిలిపి అవతలి వైపునకు వెళ్లాడు. తిరిగి లారీ వద్దకు వస్తూ డీవైడర్‌ను దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వెలుతున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవరు దినేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటా హుటీన సంఘటనా స్థలానికి చేరుకొని కారు డ్రైవరును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవరు దినేష్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు.

దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న చక్రధర్‌గౌడ్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణంలోని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ కార్యాలయంపై దాడికి యత్నించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఫౌండేషన్ అధ్యక్షుడు చక్రధర్‌గౌడ్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ కార్యాలయ వాచ్‌మెన్‌పై గురువారం రాత్రి గుర్తు తెలియని ఐదుగురు వ్యక్తులు దాడికి యత్నించారని ఆరోపించారు. కార్యాలయంకు నిప్పు పెట్టి కాలుస్తామని బెదిరించినట్లు వారు తెలిపారు. కౌలు రైతుల కోసం ఏర్పాటు చేసిన వాహనంపై గుర్తు తెలియని వ్యక్తులు మూత్ర విసర్జన చేశారన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని వారో కోరారు. తమకు, కార్యాలయానికి పోలీసులు భద్రత కల్పించాలన్నారు. దాడికి పాల్పడ్డ వారిపై టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ సమావేశంలో కస్తూరి హరీశ్, ప్రవీణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశానికి ప్రమాదం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఎ రహమాన్

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అదానీ, అంబానీ లకు కట్టబెడుతూ, మతరాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుతున్న నరేంద్రమోదీ ప్రభుత్వం దేశానికి ప్రమాదకరమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ రహమాన్, పట్టణ కార్యదర్శి వి. వినోద పేర్కొన్నారు. బీజేపీ హటావో దేశ్ కో బచావో నినాదంతో సీపీఐ కేంద్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంటులో ప్రభుత్వానికి వ్యతిరేఖంగా మాట్లాడిన వారిపై సీబీఐ, ఈడీ దాడులతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, నిరుద్యోగం బాగా పెరిగిపోయిందని అన్ని రంగాల్లో దేశం వెనక్కి నెట్టబడిందన్నారు. ఈ కార్యక్రమంలో తాజుద్దీన్, ముస్తాఫా, ఎం.రమేశ్, సాదిక్‌అలి, దత్తుస్వామి, రాజు, యాకుబ్‌అలి, పూలమ్మ, లక్ష్మి, అనసుజా తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి



పేకాట స్థావరం నుంచి స్వాధీనం చేసుకున్న బైకులు



నగదు, సెల్ ఫోన్లు

- 6 బైకులు, 6 సెల్ ఫోన్లు, రూ.33,700లు స్వాధీనం
- ఆరుగురిపై కేసు నమోదు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న స్థావరంపై శుక్రవారం టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నరేశ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 6 బైక్‌లు, ఆరు సెల్ ఫోన్లతో పాటు, రూ.33,700లు స్వాధీనం చేసుకున్నారు. ఒకరు పరారీలో ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్‌ఐ గంగరాజు తెలిపారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాలు, ఇండ్లు, ఫాంహౌస్‌ల్లో పేకాట, జూదం ఆడినా, మరే ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నరేశ్ హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడినట్లు గమనిస్తే డయల్ 100 లేదా, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూం నెంబర్ 8712667100కు సమాచారం అందించాలని కోరారు. పేకాట, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత



మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సిబ్బందికి సూచించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సెక్షన్ ఇన్‌చార్జి, బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందికి ఎమర్జెన్సీ కమ్యూనికేషన్ ప్లాన్, కమ్యూనికేషన్ వ్యవస్థ గురించి సీపీ కార్యాలయంలో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పోలీస్ స్టేషన్‌కు రాత్రి సమయాల్లో ఏదైనా ముఖ్యమైన ఫోన్ కాల్ వస్తే సంబంధిత సెక్షన్ ఇన్‌చార్జి ఉన్నతాధికారులకు, ఎస్‌బి కంట్రోల్ రూం, పోలీసు కంట్రోల్ రూంకు తెలియపర్చాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లకు నూతన మొబైల్ ఫోన్లు, నూతన నెంబర్లు ఇచ్చారన్నారు. వాటిని సెక్షన్ ఇన్‌చార్జి దగ్గర మాత్రమే ఉంచాలని తెలిపారు. విధినిర్వహణలో ఉన్న అధికారుల వద్ద మాత్రమే ఈ ఫోన్ ఉండాలని సీపీ సూచించారు. రాత్రి సమయాల్లో విహెచ్‌ఎఫ్ సెట్, మొబైల్ ఫోన్‌లో ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా సెక్షన్ ఇన్‌చార్జి కంట్రోల్ రూమ్ నుంచి విహెచ్‌ఎఫ్ సెట్, ఫోన్‌లో కానీ స్పందించకపోతే కంట్రోల్ రూంలో ఉండే సిబ్బంది వెంటనే అధికారులకు తెలపాలని సూచించారు. డయల్ 100కాల్ సెక్షన్ ఇన్‌చార్జికి రాగానే సంబంధిత బ్లూ కోల్ట్, పెట్రోకార్ సిబ్బందికి సమాచారం చేరవేయాలన్నారు. ఐదు నుంచి పది నిమిషాల్లోపే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థపై సీసీఆర్‌బి అధికారి చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.